క్లుప్తంగా

వైభవం..శ్రవణోత్సవం



తిరుచ్చిపై స్వామి, అమ్మవార్ల విహారం

నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధ ప్రసిద్ధ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీస్వామివారి జన్మ నక్షత్రం శ్రవణంను పురస్కరించుకుని గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామున సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచి నిత్యపూజా కైంకర్యాలతో గంట, నైవేద్య సమర్పణ పూర్తి చేశారు. శ్రవణా నక్షత్ర గడియల్లో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి శ్రీస్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం శ్రీదేవీ, భూదేవీ సమేత స్వామివారి ఉత్సవర్లను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి తిరుచ్చి వాహనంపై కొలువదీర్చి పూజలు చేశారు. అనంతరం తిరుమాడవీధుల్లో ఊరేగింపు నయనానందకరంగా సాగింది.

గురుదక్షిణామూర్తికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో గురుదక్షిణామూర్తి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తికి గురువారం ఆగమోక్తంగా విశేష పూజలు నిర్వహించారు. పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు.

విద్యా కానుక షూ కొలతలు సేకరణ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు విద్యా కానుకలో ఇవ్వనున్న షూ కోసం కొలతలను సేకరిస్తున్నట్లు ఎంఈఓ మునిసుబ్రమణ్యం తెలిపారు. ఆయన లక్ష్మీపురం గిరిజన కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల షూ కొలతలను స్వయంగా సేకరించారు. టీచింగ్ ఎట్ రైట్ లెవెల్ లో విద్యార్థులకు నిర్వహించిన మూడు టెస్టుల ఫలితాలను విద్యార్థులకు తెలియజేసి, సామర్థ్యాలను పెంపొందించాలని సూచించారు.

వలంటీర్ రాజీనామా



రాజీనామా లేఖను అందిస్తున్న దయాకర్

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు సచివాలయ పరిధిలో వడ్డిపాళెం వలంటీర్ ఆర్.దయాకర్ స్వచ్ఛందంగా గురువారం తన విధులకు రాజీనామా చేశారు. తన రాజీనామా లెటర్‌ను ఆమో దించమని చిన్న పాండూరు సచివాలయ కార్యదర్శి హబీబ్‌కు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాల తీవ్రమైన దుర్భాషలకు మనస్తాపం చెంది రాజీనామా చేశానని, ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు.



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అక్కచెల్లెమ్మల హారతి

పోటెత్తిన అభిమానం

మేమంతా సిద్ధం బస్సు యాత్రకు ప్రజాభిమానం పోటెత్తింది. మేమంతా సిద్ధం అంటూ జనం గర్జించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన బస్సు యాత్ర గురువారం ఉదయం రేణిగుంట మండలం గురవరాజుపల్లె నుంచి మొదలైంది. అక్కడి నుంచి వెదుళ్లచెరువు, గుత్తివారిపల్లె, ఏర్పేడు, ఇసుకతాగేలి, అంజిమేడు, సీతారాంపేట, కాపుగున్నేరి, శ్రీకాళహస్తి మీదుగా నాయుడుపేట చేరుకుంది. ప్రతి చోట అభిమాన నేతను చూసేందుకు జనం రోడ్డుకు ఇరువైపులా బారులు తీరారు. మండుటెండను సైతం లెక్క చేయక యువకులు బస్సు వెనుక పరుగులు తీయడం ప్రతి గ్రామంలో కనిపించింది. వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజలు రోడ్లపైకి పెద్దఎత్తున రావడంతో పండుగ వాతావరణం తలపించింది. భారీ గజమాలలు, పూల వర్షంతో ఆత్మీయ స్వాగతం పలికారు. అభిమాన నేతతో కరచాలనానికి అక్కచెల్లెమ్మలు ఉత్సాహం చూపారు.– రేణిగుంట



ఆత్మీయ నేతకు చిరుకానుక..



కటౌట్‌తో కదం తొక్కారు..



పుష్పాభిషేకం..



అన్నయ్య కరచాలనం కోసం..



జననేతకు స్వాగతం పలికేందుకు..



కొండంత ప్రేమతో..



మేమంతా.. మీవెంటే



జగన్ మామయ్యకు జై..

వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తాం

- ఎంపీగా గురుమూర్తి, ఎమ్మెల్యేగా మధుసూదన్‌రెడ్డిని గెలిపించుకుంటాం
- సీఎం వైఎస్ జగన్‌కు మాటిచ్చిన శ్రీకాళహస్తి నియోజకవర్గ నేతలు

రేణిగుంట: 'మా నియోజకవర్గంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మళ్లీ గెలిపించుకుంటాం.. మళ్లీ మీరే ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయాలి... సంక్షేమ ఫలాలు ఇలాగే పేద ప్రజలకు అందించాలి జగనన్నా... అంటూ శ్రీకాళహస్తి నియోజకవర్గానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాటిచ్చారు.' రేణిగుంట ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు సంధ్యారాణి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు తిరుమలరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గంగారి రమేష్, అన్ని గ్రామాలకు చెందిన సర్పంచులు, సీనియర్ నాయకులు రేణిగుంట మండలం గురవరాజుపల్లెలో బస కేంద్రం వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి నాయకులందరినీ పరిచయం చేసి అభిమాన నేతతో ఫొటోలు దిగారు. అలాగే నియోజకవర్గంలోని ఏర్పేడు, శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాలకు చెందిన పలువురు సీనియర్ నాయకులు కూడా అభిమాన నేతకు కలసి మరోసారి ఎమ్మెల్యేగా బియ్యపు మధుసూదన్‌రెడ్డిని, ఎంపీగా మద్దెల గురుమూర్తిని భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని స్పష్టం చేశారు.

మేమంతా సిద్ధంకు తరలిన మహిళలు

బుచ్చినాయుడుకండ్రిగ: నాయుడుపేటలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం బహిరంగ సభకు మండలంలోని 28 గ్రామ పంచాయతీల నుంచి స్వచ్ఛందంగా మహిళలు ఉత్సాహంగా వెళ్లారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు కూడా భారీగా తరలి వెళ్లారు.

కదం తొక్కిన ఏర్పేడు

ఏర్పేడు: నాయుడుపేట మేమంతా సిద్ధం సభకు వెళుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గురువారం మండల కేంద్రంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికారు. ఏర్పేడు చెక్‌పోస్ట్ వద్ద ప్రధాన రహదారి, కోబాక రోడ్డు, వెంకటగిరి కూడలి వరకు అశేష జనసంద్రంగా మారింది. పార్టీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికి క్రేన్ ద్వారా భారీ పూలమాలను వేశారు. సీఎం ప్రజలకు ఆప్యాయంగా అభివాదం చేశారు. అక్కడ నుంచి శ్రీకాళహస్తి మండలంలోకి మేమంతా సిద్ధం బస్సుయాత్ర ప్రవేశించింది. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు జనార్దన్‌రెడ్డి, శ్రీనివాసులు, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శివయ్య, సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్దన్ యాదవ్, మాజీ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి నాయకులు పరమాల చంద్రశేఖర్, రాజశేఖర్‌రెడ్డి, లోకనాథరెడ్డి, గురునాథం, ఢిల్లీబాబు, జీపీ యాదవ్, గుణశేఖర్ నాయుడు, చిరంజీవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకర్షించిన అమర్‌నాథ్‌రెడ్డి బైక్

శ్రీకాళహస్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్రలో వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన అభిమాని అమర్‌నాథ్‌రెడ్డి బైక్ ప్రజలను ఆకర్షించింది. మంచి జరిగి ఉంటే ప్రజలే స్టార్ క్యాంపైన్లు కావాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపుతో అమర్‌నాథ్‌రెడ్డి విశాఖ పట్టణంలో ఉద్యోగాన్ని వదులుకుని రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. మేమంతా సిద్ధం బస్సు యాత్ర వెంట బైక్‌పై వెళుతున్నాడు. డ్రెస్, బైక్ మొత్తం జగనన్న స్టిక్కర్లు, పార్టీ జెండా, రంగులు అందరినీ ఆకర్షించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఇప్పటి వరకు వెళ్లిన అన్ని ప్రాంతాల్లో తామంతా జగనన్న వెంటే అని జనం ముక్తకంఠంతో చెబుతున్నారని తెలిపారు.



బైక్ యాత్రలో అమర్‌నాథ్‌రెడ్డి

నేడు రాజేష్ ఎన్నికల ప్రచారం

వరదయ్యపాళెం: మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ శుక్రవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని పార్టీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9గంటలకు రాచర్లలో ప్రారంభమై అరుంధతివాడ, చిన్న పాండూరు, మోపూరుపల్లె, అరుదూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం జరుగుతుందని పేర్కొన్నారు. పార్టీ ప్రజాప్రతినిధులు, శ్రేణులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బాబు కుట్ర..వృద్ధుల అగచాట్లు

పింఛన్ తీసుకునేందుకు వృద్ధులు, దివ్యాంగులు గురువారం నానా అవస్థలు పడ్డారు. దూర ప్రాంతాల నుంచి ఆటోలు, ఇతరుల సాయంతో సచివాలయాలకు శ్రమపడి చేరుకోవాల్సి వచ్చింది. వృద్ధులు, దివ్యాంగులకు ఓట్ ఫ్రం హోం కార్యక్రమం లాగేనే పింఛన్ ఫ్రం హోం ను ఎన్నికల కమిషన్ అధికారులు అమలు చేయాలని వృద్ధులు కోరారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు రాజకీయ కుట్రకు తాము బలి అయ్యామని వృద్ధులు వాపోయారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాటినుంచి ఇంటి వద్దే పింఛన్ తీసుకుంటూ ఏ అవస్థ లేకుండా హాయిగా జీవితం గడిచేదని, ఇప్పుడు ఈ కష్టాలేంటి, మమ్మల్ని ఇబ్బందులు పెట్టిన వారికి మా ఉసురు తగలకపోదు అంటూ వృద్ధులు, దివ్యాంగులు శాపనార్థాలు పెట్టారు.

దుర్మార్గులు బాగుపడరు



మా గ్రామం సచివాలయానికి సుమారు 4 కిలోమీటర్ల దూరం ఉంటుంది. నా వయస్సు 75 సంవత్సరాలు. పింఛను కోసం ఎండనబడి పోలేక రూ.200 ఇచ్చి ఆటోలో వెళ్లాల్సి వచ్చింది. వలంటీర్ ఉన్నప్పుడు ఉదయాన్నే నేరుగా మా ఇంటికే వచ్చి తలుపు తట్టి పింఛను ఇచ్చారు. వలంటీర్లను పని చేయకుండా టీడీపీ కుట్ర చేసి అడ్డుకోవడం చాలా దుర్మార్గం. ముసలోళ్లు, అవిటోళ్లను ఇబ్బంది పెట్టిన చంద్రబాబు బాగుపడడు.

– సుబ్బమ్మ, కాంపాళెం(బీఎన్‌కండ్రిగ)



పెద్ద పాండూరులో మండుటెండలో వేచి ఉన్న వృద్ధులు



కంటిచూపు లేక భార్యతో పెద్ద పాండూరు సచివాలయానికి..

పేదలగోడు తగులుతుంది



పింఛన్ సొమ్ముతో జీవనం సాగించే నిరుపేదల పైనా చంద్రబాబు ప్రతాపం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ఇంటి వద్దనే పింఛన్ సొమ్ము అందజేశారు. ఎన్నికల ముసుగులో వలంటీర్లు పింఛన్ల ఇవ్వకూడదంటూ కుట్ర చేయడం ఏమిటి? ఉదయం నుంచి సచివాలయం వద్ద పడిగాపులు కాసి పింఛన్ తీసుకున్నా. ఇంతగా ఏడిపించిన వారికి పేదల గోడు తగులుతుంది.

–సరోజమ్మ, తొండంబట్టు (వరదయ్యపాళెం)

వృద్ధులపై పగ ఎందుకో?



వృద్ధులపై రాజకీయాలు ముడిపెట్టి చంద్రబాబు ఇబ్బందులకు గురి చేయడం మంచిది కాదు. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేసే పింఛన్‌ను ప్రక్రియను అడ్డుకోవడం నీచ రాజకీయం. నాకు రెండు కాళ్లు పనిచేయవు. ఇంటోనుంచి కదలనేని పరిస్థితి. తప్పని సరి కావడంతో వాకర్ సాయంతో సచివాలయం వచ్చా. వృద్ధులను జగన్‌మోహన్ రెడ్డి కష్టపెట్టకుండా పింఛన్ ఇచ్చేవారు. జగన్ మోహన్ రెడ్డి పనితీరుకు, చంద్రబాబు పనితీరుకు చాలా తేడా ఉంది.

- డి. వేణుగోపాల్ శెట్టి, గంగమిట్ట వీధి, సత్యవేడు

అడుగు ముందుకు పడదు..



నాకు వయస్సు 90. వయసు మీద పడడంతో అడుగు ముందుకు పడడంలేదు. అసలే ఎండలు, బయటకు వెళ్లే పరిస్థితి లేదు. వీధులోకి రావాలన్నా పిల్లల సాయం తీసుకుంటాను. ఇద్దరి సాయంతో ఆటోలో సచివాలయం వద్దకు వచ్చాను. ఆటో దిగి నడవలేక పోతే లాక్కునిపోయారు. మాలాంటి వాళ్ల పరిస్థితి అర్థం చేసుకోండి. వలంటీర్లు ఇంటికే వచ్చి పింఛన్ ఇచ్చేలా ఎలక్షన్ కమిషన్ అనుమతి ఇవ్వాలి. చంద్రబాబు వృద్ధులపై రాజకీయాలు చేయడం నీచాతినీచం.

– పి.సరోజమ్మ, గవండ్లవీధి, సత్యవేడు